వరుస పద్ధతిలో వరినాట్లు



తాడు కొలతలతో రబీ వరినాట్లు వేస్తున్న బెంగాళీ కూలీలు

- తాడు సాయంతో నిర్దిష్ట పద్ధతిలో వరి నాట్లు వేసుకున్న బెంగాలీ కూలీలు
- తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి
- వరుసల మధ్య సమానం ధూరంలో పంటకు మేలు

భామిని: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చినా.. ఇంకా అనేక చోట్ల రైతులు సంప్రదాయ విధానంలో వరినాట్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కూలీల కొరత కారణంగా ఒక్కోసారి నాట్లు ఆలస్యం కావడం జరుగుతుంది. అలాగే సాగు ఖర్చు పెరగడంతో పాటు సమయం వృథా అవుతుంది. అయితే బెంగాల్‌కు చెందిన వ్యవసాయ కూలీలు లైన్ పద్ధతిలో తక్కువ సమయంలో సంప్రదాయ విధానంలో వరినాట్లు వేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు.

లైన్ పద్ధతి..

తాడు సాయంతో నాట్లు వేయడమే లైన్ పద్ధతి. ఈ పద్ధతిలో పొడవాటి తాడును లాగిపట్టుకుని దాని వెంబడి సమాన దూరంలో వరినాట్లు వేస్తారు. ఇలా నిర్దిష్ట దూరంలో నాట్లు వేయడం వల్ల తక్కువ వరినారుతో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు పూర్తిచేయవచ్చు. అలాగే పంట మొదళ్లకు గాలి, వెలుతురు పుష్కలంగా తగలడంతో పిలకలు అధికంగా రావడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. కలుపు నివారణ సులభమవుతుంది. పంట తెగుళ్ల వ్యాప్తి కూడా తక్కువగా ఉంటుందని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు.

ఐదో వంతు నారుతో..

స్థానిక కూలీలతో ఎకరా విస్తీర్ణంలో వరినాట్లు వేసేందుకు సుమారు రెండు వందల వరకు నారుకట్టలు అవసరం కాగా.. బెంగాలీ కూలీలు లైన్ పద్ధతిలో ఐదోవంతు నారుకట్టలతో నాట్లు పూర్తిచేస్తున్నారు. సాధారణంగా రైతులు ఎకరా నారుమడికి 30 కిలోల విత్తనాలు వేసుకుంటుండగా.. లైన్ పద్ధతిలో కేవలం 10 కిలోల విత్తనాలు సరిపోతాయని బెంగాలీ కూలీలు అంటున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 12 మంది బెంగాళీ కూలీలు రోజుకు ఐదు ఎకరాల్లో నారు తీయడంతో పాటు నాట్లు పూర్తిచేస్తున్నారు. ఎకరానికి రూ.4200లు వసూలు చేస్తున్నారు. స్థానిక కూలీలతో ఎకరా పొలంలో నాట్లు వేయిస్తే రూ.6800లు వరకు ఖర్చు అవుతుంది.

ఖర్చులు తగ్గుతున్నాయి



లైన్ పద్ధతిలో వరినాట్లు వేయడంతో ఖర్చు తగ్గుతుంది. సమయం మిగులుతుంది. దూరం దూరంగా వరినాట్లు వేస్తూ పని వేగంగా పూర్తిచేస్తున్నారు. దమ్ము చేసిన పొలంలో అన్ని పనులూ వారే పూర్తిచేస్తున్నారు. రైతులకు పని ఒత్తిడి కూడా తగ్గుతుంది.

– మునగవలస నూకరాజు, రైతు, నేరడి-బీ, భామిని మండలం

లైన్ పద్ధతి శాస్త్రీయమైనదే..



తాడు కొలతలతో వరినాట్లు వేసే పద్ధతి శాస్త్రీయమైనదే. ఈ విధానం ముందుగా గోదావరి జిల్లాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో నాట్లు పూర్తి చేయవచ్చు. దూరం దూరంగా వరికుదుళ్లు వేయడంతో గాలి, వెలుతురు బాగా తగిలి చేను దుబ్బుకట్టడంతో పాటు దిగుబడి పెరుగుతుంది.

కె.సింహాచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

పాలకొండ రూరల్: తెలుగువారి కొత్త సంవత్సరం ఉగాధి పర్వదినం రోజున జగనన్న కాలనీలో లక్ష్యాల మేరకు సామూహిక గృహ ప్రవేశాలు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ నురూల్‌కమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ, నగరపంచాయతీ అధికారులతోపాటు సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాల తాజా స్థితిగతులపై వార్డుల వారీగా సమీక్ష చేపట్టారు. నిర్దేశిత సమయంలోగా నిర్మాణాలు పూర్తి చేయించాలని సూచించారు. కాలనీలో మౌలిక సౌకర్యాలపై ఆరాతీశారు. నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, హౌసింగ్ ఏఈ మాధవరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను బలపరుద్దాం..



మాట్లాడుతున్న మండల కన్వీనర్ జనార్దనరావు

కొమరాడ: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్రా జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను పార్టీ అభ్యర్థులంతా బలపర్చాలని మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కొమరాడలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో సుధాకర్‌ను గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులంతా కృషి చేయాలని కోరారు. అలాగే ఇటీవలే జరిగిన ప్రమాదంలో ప్రాణాలు పొగొట్టుకున్న అంటివలస గ్రామంలోని మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ కేడర్ తమవంతు ఆర్థిక సాయం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరత్‌నాయుడు, దాసరి శ్రీధర్, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగ మల్లేశ్వర రావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసుదనరావు పాల్గొన్నారు.

వట్టిపోయిన ఒట్టిగెడ్డ



అడుగంటిన ఒట్టిగెడ్డ

వీరఘట్టం: వేసవి సమీపించడంతో ఎండ తీవ్రత పెరిగింది. దీంతో చిన్న చిన్న కాలువలు, గెడ్డల్లో నీరు ఎండిపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. వీరఘట్టం గుండా ప్రవహిస్తున్న ఒట్టిగెడ్డలో నీరు అడుగంటిపోవడంతో స్థానికులకు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని దశమంతపురం, కంబర, చలివేంద్రి, నడుకూరు, వీరఘట్టం, చిదిమి గ్రామాల మీదుగా ఒట్టిగెడ్డ ప్రవహిస్తోంది. ఫిబ్రవరి నెలాఖరులోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో తీవ్ర నీటి కష్టాలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటి పన్ను వసూలపై దృష్టి

వీరఘట్టం: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయి వసూళ్లపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పంచాయతీల్లో పనులు చేపట్టాలంటే జనరల్ ఫండ్ నిధులను మనమే సేకరించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లతో మాట్లాడి వీలైతే వారి సహకారం తీసుకుని ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు.

మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్

కురుపాం: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్, వెంకటరమణ, అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు చాలీచాలని మెస్ చార్జీలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన మెనూ ప్రకారం మెస్ చార్జీలు పెంచాలని కోరారు. పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏల పరిధిలో పౌష్టికాహారం సక్రమంగా అందాలంటే మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో పెద్దకాపువీధి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ఆల్ ఇండియా చిల్డ్రన్ ఆర్ట్ అకాడమి(నెల్లూరు) ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వేదిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు), తంపటాపల్లి, ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వాటపాగు ఎంపీపీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని ఆయా పాఠశాలల డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎస్.లలితకుమారి, జి.మురళి, వై.సత్యంనాయుడు, టి.బాలమురళి తెలిపారు. విజేతలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సోమవారం బంగారు పతకాలతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని మరుపెంట ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, పాఠశాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల్లో అంతర్గత కౌశలాలను వెలికితీయాలని, ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఆరా తీశారు.

తాగనీటి సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్: పట్టణంలోని 3,4,5,6,7,8 వార్డులకు మంగళవారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంపిలి వద్ద ఉన్న 15 హెచ్‌పీ మోటార్ పాడవడంతో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మోటార్ మరమ్మతుల అనంతరం యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని, అంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ: నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. చైర్మన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ-విశాఖ, వీరఘట్టం రహదారుల్లో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని, మైనర్లు, లైసెన్స్ లేనివారికి వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై అపరాధ రుసుం విధించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: మండలంలోని తాటిమానుగూడ, నల్లరాయిగూడలకు చెందిన ఆరిక రాకేష్(13), ఆరిక జీవన్(20) ఈనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, గేదెల మోహన్ సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే కళావతి సహకారంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

భూ సర్వేకి రైతులు సహకరించాలి

భామిని: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష-భూహక్కు సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు కోరారు. మండలంలోని పెద్దదిమిలిలో వీఆర్వో పి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే సర్వేలో గుర్తించిన భూముల వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ మేరకు రైతులకు సెక్షన్ 90 కింద నోటీసులు ఇచ్చారు. రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ నిమ్మల శేఖరం, ఆర్‌ఐ ఎస్.రాంబాబు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న సత్యసాయి భక్తులు

వీరఘట్టం: ఎండ తీవ్రత పెరుగుతుండడంతో వేసవి తాపంతో వచ్చే పాదచారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక సత్యసాయి భక్తులు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. సత్యసాయి మందిరం ఎదురుగా చలివేంద్రం ఏర్పాటు చేసి దారినపోయే వారందరికీ మజ్జిగ అందించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ వి.విశ్వప్రసాద్, సాయి భక్తులు గెంబలి మురళీ, కందుల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దేవతలారా దీవించండి



భామిని: నేరడి-బిలో వెలసిన శిర్లి ఎల్లమ్మతల్లి విగ్రహం



పాలకొండ: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: దేవతలారా దీవించండంటూ భక్తులు శిర్లి పోతన్న, ఎల్లమ్మలను కొలిచారు. శిర్లు యాత్ర సందర్భంగా వీరఘట్టం సాయినగర్ సమీపంలో వెలసిన పోతన్న గుడి వద్ద సోమవారం భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి దంపతులు పూజలు చేశారు. అనంతరం మేజరు పంచాయతీ పరిధిలోని ప్రజలు పోతన్న, ఎల్లమ్మను దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన జాతర భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం వరకు జాతర కొనసాగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

- **పాలకొండ:** శిర్లి పోతన్న, ఎల్లమ్మ జాతర సందర్భంగా పట్టణంలోని శిర్లి పోతన్నవీధిలో ఉన్న పోతన్న ఆలయంలో భక్తులు రెండో రోజు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శిర్లి దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఉదయం తడి దుస్తులతో జోగి దండి ఎల్లమ్మకు సమర్పించారు. సీఐ మురళీధర్, ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి శిర్లి ఎల్లమ్మ జాతర

భామిని: మండలంలోని నేరడి-బిలో వెలసిన శిర్లి ఎల్లమ్మతల్లి జామి జాతర మంగళవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తొలిరోజు ఎల్లమ్మతల్లిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.



వీరఘట్టం: శిర్లి పోతన్న, ఎల్లమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తేనెటీగల పెంపకంతో జీవనోపాధి



తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

సీతంపేట: ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు తేనెటీగల పెంపకంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాబార్డు డీడీఎం నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. మార్కెట్లో స్వచ్ఛమైన తేనెకు మంచి డిమాండ్ ఉందని, రైతులు తేనెటీగల పెంపకాన్ని జీవనోపాధిగా మార్చుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ కాంతారావు మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల్లో పువ్వుల నుంచి తేనె తీయడం జరుగుతుందన్నారు. తద్వారా ఆదాయ మార్గాలు బాగుంటాయన్నారు. కార్యక్రమంలో మన్యం సహజ కంపెనీ సీఈఓ బి.శంకరరావు, ఎం.రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పి.ఆమిటిలో వైద్య శిబిరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభాకరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ వద్ద తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అభిలాష్, 104 వైద్యాధికారి జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్‌తో బాధపడే వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి నుంచి వచ్చిన ఆప్తాలమిక్ అసిస్టెంట్ భీమశంకర్, సాంబరావు, సురేష్ రోగులకు కంటి పరీక్షలు చేశారు. 18 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వారికి మార్చి 1న విజయనగరంలోని ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ యమున, హెల్త్ అసిస్టెంట్ సునీత, ఆశా వర్కర్లు నాగమణి, హైమావతి, సుధ సేవలందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గౌరీశంకరరావు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకరరావు సోమవారం పరిశీలించారు. వండిన పదార్థాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన మెనూను తప్పనిసరిగా అమలుచేయాలని, అందరు విద్యార్థులు పాఠశాలలోనే భోజనం చేసేలా చూడాలని సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నాడు-నేడు ద్వారా అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, వైస్ సర్పంచ్ కిశోర్, వార్డు సభ్యుడు జె.వెంకటరావు ఉన్నారు.

గిరిజన స్పందనకు 14 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఏపీఓ వై.రోసిరెడ్డి నిర్వహించిన గిరిజన స్పందనకు 14 వినతులు వచ్చాయి. కుడ్డపల్లికి చెందిన సవర ఆనందరావు, చిలకమ్ములు కొండచీపుర్లు కొనుగోలుకు రుణం ఇప్పించాలని అధికారులను కోరారు. గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని అన్నంపేట, ఓంద్రుజోల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. డోలమడ గ్రామస్తులు టీటీడీ గుడి వద్ద తాగునీటి బోరు ఏర్పాలు చేయాలని విన్నవించారు. దారపాడు పంచాయతీ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు సీసీ రోడ్లు నిర్మించాలని సర్పంచ్ సుందరమ్మ కోరారు. ఉప్పరజమ్మి గ్రామస్తుడు అప్పలస్వామి రెవెన్యూ పట్టాలో పేరు మార్చాలని దరఖాస్తు చేశాడు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మాన్‌రావు

భామిని: రోడ్డు భద్రత నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ఎస్సై వై.అమ్మాన్‌రావు సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారితో పాటు వారి తల్లిదండ్రులు, వాహన యజమానిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బండి నడపాలనే కుతూహలంతో ప్రమాదాల బారిన పడొద్దని విద్యార్థులకు సూచించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు, బస్సు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలకు గురై మీ కుటుంబాలను విషాదంలో ముంచొద్దని కోరారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను వివరించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, డబ్ల్యూపీసీ చందన పట్నాయిక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్



సూపరింటెండెంట్లతో మాట్లాడుతున్న డీఐఈఓ మంజులవీణ

పాలకొండ రూరల్: సీసీ కెమెరాల నిఘా మధ్య ఇంటర్మీడియెట్ ప్రాక్టిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ మంజురవీణ అన్నారు. పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇంటర్ బోర్డు సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు



పెదఖర్జలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తికావడంతో వేతనదారులు పనులకు వెళ్తున్నారు. ఉపాధిహామీ పథకం అధికారులు గ్రామసభల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నారు. మండలంలో మొత్తం 12,255 జాబ్ కార్డులు ఉండగా 24,388 మంది వేతనదారులున్నారు. వారిలో రోజుకు సుమారు 5వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. వేతనదారుల సంఖ్య మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ప్రస్తుతం ల్యాండ్ లెవెలింగ్, ట్రెంచ్, ఎంఐ ట్యాంకు, ఎర్త్, స్టోన్ బెండింగ్ వంటి పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది లేబర్ బడ్జెట్, మెటీరియల్ కలిపి మొత్తం రూ.23.76 కోట్లతో పనులు చేపట్టారు. దినసరి వేతనం రూ.218.5 చొప్పున ఒక్కో వేతనదారులకు లభించింది.

అడిగిన వారందరికీ పని

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నాం. జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే 14 రోజుల్లో కార్డు మంజూరు చేస్తాం. ప్రతిరోజు 5వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం.

– డి.శివరామకృష్ణ, ఏపీఓ, గుమ్మలక్ష్మీపురం

పనుల పరిశీలన

పాలకొండ రూరల్: ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ డొండ త్రినాథులు సూచించారు. మండలంలోని దుగ్గి, వాటపాగు, నవగాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అనంతరం కొండాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.